## చల్లబడ్డ వాతావరణంతో ఉపశమనం

ప్రజాశక్తి - గండేపల్లి

గత కొన్ని రోజులుగా అత్యధిక ఉష్ణోగ్రతలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న తరుణంలో శనివారం సాయంత్రం ఒకసారి వాతావరణం చల్లబడి చినుకులు పడటంతో ప్రజలు ఉపసమనం పొందారు. గండేపల్లి మండలంలోని పలు చోట్ల ఒకసారిగా వాతావరణం చల్లబడి వర్షం చినుకులు పడటంతో ప్రజలు ఊపిరిపీల్చు కున్నారు. సూరంపాలెం ఆదిత్య పరిసర ప్రాంతాల్లో శనివారం సాయంత్రం మబ్బులతో ఆహ్లాదకరమైన వాతావరణంలో కురిసిన వర్షంతో పరిసర ప్రాంతాల ప్రజలు

ఆహ్లాదకరమైన మబ్బులతో ఆదిత్య ప్రాంగణం

ఉపాధి కూలీల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

## 200 రోజులు 'ఉపాధి' పని కల్పించాలి

**- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్**

ప్రజాశక్తి - పెద్దాపురం

ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంత కూలీలకు 200 రోజులు పని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్ శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక పంగిడి చెరువు వద్ద ఉపాధి పనులు చేస్తున్న కాండ్రకోట, గుడివాడ, మరలావ ఉపాధి కూలీలతో నిర్వహించిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ 2005లో యుపిఎ ప్రభుత్వం-1లో వామపక్షాల ఒత్తిడితో ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించారన్నారు. నాడు ఐదు కోట్ల మంది ఈ పథకంలో చేరితే నేడు 20 కోట్ల మంది ఈ పథకలో ఉపాధి పొందుతున్నారన్నారు. కేంద్రంలో ప్రస్తుత బిజెపి ప్రభుత్వం ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. 2022 -23 బడ్జెట్లో ఈ పథకం నిమిత్తం 90 వేల కోట్లు కేటాయిస్తే, ఈ ఏడాది 60 వేలం కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. క్రమేపి ఈ పథకాన్ని రద్దు చేసే దిశలో బిజెపి ప్రభుత్వం పావులు కదుపుతుందన్నారు. ఉపాధి కూలీలకు రూ.257 మాత్రమే కూలి ఇస్తున్నారన్నారు. 4 వారాలుగా ఈ కూలి బకాయిలు చెల్లించడం లేదన్నారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.500 వేతనం లభించేలా చూడాలన్నారు. వ్యవసాయ రంగం యాంత్రీకరణ వల్ల ఉపాధి కోల్పోయిన గ్రామీణ కూలీలకు ఈ ఉపాధి పథకం పనులు పెద్ద దిక్కుగా ఉన్నాయన్నారు. అందరూ కలిసి కట్టుగా ఈ ఉపాధి పథకాన్ని రక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు గడిగట్ల సత్తిబాబు, డి.క్రాంతి కుమార్, నీలపాల సూరిబాబు పాల్గొన్నారు.

# వేతనాల పెంపు అమలేదీ.?

- **నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి కనీస వేతనాలు కరువు**
- **జీవో 5,7 ప్రకారం ఇవ్వాలంటూ విజ్ఞప్తులు**
- **ఆందోళనకు సిద్ధ పడుతున్న ఉద్యోగులు**

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

వైద్య ఆరోగ్య సేవలు అందించడంలో కీలక పాత్ర వహిస్తున్న నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదు. ఎన్‌హెచ్‌ఎంలో భాగంగా వివిధ విభాగాలైన పట్టణ ఆరోగ్యం, ఆర్ఎన్‌టిసిపి, ఆర్‌బిఎస్‌కె, ఆర్‌బిఎస్‌యు, ఎన్ఆర్‌సి, ఎస్ఎన్‌సియు, ఎన్‌టిఎల్‌పి, ఆర్‌కెఎస్‌కె, ఎంహెచ్‌పి, ట్రామా, బ్లడ్ బ్యాంకులు, ఆయూష్ తదితర కేటగిరీల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ఎఎన్‌ఎంలు, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫిజియో థెరపిస్టులు, సైకాలజిస్టులు, న్యూట్రీషియనిస్టులు, ఎక్స్‌రే టెక్నీషియన్లుగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో సుమారు 2,500 మంది ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం 11వ పీఆర్సీ ప్రకారం 2022 జనవరి నుంచి వైద్య ఆరోగ్య శాఖలో రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్ ఔట్, సోర్సింగ్ ఉద్యోగులకు జీఓ నంబర్ 5, 7 ప్రకారం వేతనాలు పెంపు అమలు చేస్తున్నారు. కానీ ఎన్‌హెచ్‌ఎం వారికి మాత్రం వేతనాల పెంపును అమలు చేయడం లేదు.

**● హామీ అమలు కోసం పట్టు**

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేస్తామని ఎన్నికల సమయంలో వైసీపీ హామీ ఇచ్చింది. నామమాత్రంగానే వేతనాలు పెంచి చేతులు దులుపుకుంది. నాలుగేళ్ల గడిచినా నేటికీ హామీ అమలు చేయకపోవడంతో ఉద్యోగులు పలు సందర్భాల్లో వివిధ రూపాల్లో విజ్ఞప్తులు చేస్తున్నారు. అయితే అరకొర వేతనాలతో పనిచేస్తున్న వీరందరికీ కుటుంబ సభ్యులకు వివిధ ప్రభుత్వ పథకాలను, సంక్షేమ పథకాలను నిలిపివేసింది. కనీస వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకుండా తమ తల్లిదండ్రులకు వచ్చే వద్ధాప్య పెన్షన్లను సైతం నిలిపివేసి దుర్మార్గంగా వ్యవహరిస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వేతనాలు పెంపు అమలు చేయాలని అనేక విధాలుగా ప్రయత్నాలు, పోరాటాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. 2022 ఆగస్టులో వైద్యారోగ్యశాఖ ఉన్నతస్థాయి అధికారులు ఉద్యోగుల సంఘం ప్రతినిధులుతో చర్చలు జరిపి వేతనాలు పెంపు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని అంగీకరిం చినప్పటికీ నేటికీ వేతనాలు పెంపు ఉత్తర్వులు ఇవ్వకపోవడం శోచనీయమని పలువురు తెలిపారు.

### హామీ అమలు చేయకపోతే దశలవారీ పోరాటాలు

రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న మాకు కనీస వేతనాలు అమలు కావడం లేదు. కోవిడ్ కాలంలో సైతం ప్రాణాలను పణంగా పెట్టి సేవలు అందించాం. ప్రభుత్వం తమను గుర్తించి సమస్యలు పరిష్కరించాలి. లేకపోతే దశలవారీగా ఆందోళనలు ఉదతం చేస్తాం.

**కెపి. నాయుడు, ఉమ్మడి జిల్లా ఎన్‌హెచ్‌ఎం జెఎసి వర్కింగ్ ప్రెసిడెంట్**

### వేతనాలు పెంచాలి

కనీస వేతనాలు అందించకపోవడంతో పెరిగిన ధరలకు అనుగుణంగా కుటుంబాల పోషణ కష్టంగా మారింది. అప్పులు చేసి జీవనం సాగించాల్సి వస్తుంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి.

**జి. వెంకట శ్రీను,**
**ఉమ్మడి జిల్లా ఎన్‌హెచ్‌ఎం, జెఎసి అధ్యక్షుడు**

### సౌకర్యాలు అమలు చేయడం లేదు

రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సెలవులు ఇవ్వడం లేదు. ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడం లేదు. ఒకే అనుభవం ఉన్నా అన్ని కేటగిరీల వారికి సమాన వేతనాలు అమలు చేయడం లేదు. మహిళా ఉద్యోగులకు వర్తించే 5 ప్రత్యేక సెలవులు, వికలాంగులకు అమలు కావాల్సిన ప్రత్యేక సెలవులను కూడా ఇవ్వడం లేదు.

**కె.రాజబాబు, ఉమ్మడి జిల్లా ఎన్‌హెచ్‌ఎం, జెఎసి పధాన కార్యదర్శి**

# ప్రభుత్వం స్పందించే వరకు పోరాటం

**- అమరావతి ఎపి జెఎసి జిల్లా చైర్మన్ పితాని త్రినాథ్**

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఒకటో తేదీకల్లా జీతాలు, పెన్షన్లు ఇవ్వాలని, బకాయి ఉన్న డిఎలు మంజూరు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రూల్ ఆఫ్ రిజర్వేషన్ కింద రెగ్యులర్ చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వార్షిక ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేసే వరకూ దశల వారీగా పోరాటాలు కొనసాగిస్తామని అమరావతి ఎపి జెఎసి జిల్లా చైర్మన్ పితాని త్రినాథ్ అన్నారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా శనివారం కాకినాడ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొని ఆందోళ నిర్వహించారు. ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని స్పహ లేకపోవడం శోచనీయమన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతుంటే నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం తగదన్నారు. ఈ మేరకు డిమాండ్ల సాధనకు చివర వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎపి జెఎసి జిల్లా కార్యదర్శి ప్రసాద్, ముఖ్య అతిథిగా రాష్ట్ర డ్రైవర్స్ అసోసియోయేషన్ అధ్యక్షులు సంసాని శ్రీనివాస్, పెన్షనర్స్ అస్సోసియేషన్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు పద్మనాభం, శాస్త్రి, విఆర్ఒ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న, కో ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్, ఆర్‌టిసి యూనియన్ జిల్లా నాయకులు సత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో ధర్నా చేస్తున్నఎపి జెఎసి నాయకులు

మే డే కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బాలం శ్రీనివాస్, రిక్షా కార్మికులు

## మేడేను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడేను కార్మికులందరూ విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బళ్ళ మార్కెట్ సెంటర్‌లోని రిక్షా యూనియన్ ఆధ్వర్యంలో మే డే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసు మాట్లా డుతూ కార్మిక హక్కులను కుదించివేస్తున్న నేటి తరుణంలో ప్రపంచవ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ వర్గాలు తిరుగుబాటు బావుటా ఎగరవేస్తున్నాయని, పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వాలకు నిరసన తెలియజే స్తున్నాయని తెలిపారు. రిక్షా కార్మికులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని రిక్షా కార్మికులకు సబ్సిడీతో కూడిన రుణాలతో ఈ రిక్షాలకు ప్రభుత్వం రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. వయసు మళ్లిన రిక్షా కార్మికులకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని అన్నారు. మేడేను స్ఫూర్తిగా తీసుకుని కార్మిక వర్గం ఒక్కటై మేడే ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రిక్షా యూని యన్ గౌరవాధ్యక్షులు సిహెచ్ మహేష్, రిక్షా యూనియన్ నాయకులు నూకరాజు, ముప్పిడి సత్తిబాబు, మరిడయ్య, వేమగిరి సత్యనారాయణ, మిరియాల గాబ్రియేల్ పాల్గొన్నారు.

## ఆదిత్యలో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలో మూడవ సంవత్సరం ఇఇఇ విద్యార్థులకు గత రెండు రోజులుగా జరుగుతున్న మాట్ ల్యాబ్ వర్క్‌షాప్ ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.టి.వి.ఎస్.కుమార్ తెలియజేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్. ఎం.సత్యనారాయణ రాజు నేతత్వంలో విద్యార్థు లకు పవర్ ఎలక్ట్రానిక్ సర్క్యూట్స్ స్టిమ్యులే షన్‌పై శిక్షణ ఇచ్చారు. ముగింపు సమావేశంలో ప్రిన్సిపాల్ విద్యా ర్థులకు ధ్రువపత్రాల ప్రదానం చేశారు. అకడమిక్ డీన్ ఎవి. మాధవ రావు, ఇఇఇ విభాగాధిపతి పొన్నాడ శ్రీనివాస్, విద్యార్థులు, పాల్గొన్నారు.

## నాడు-నేడు పనులు నాణ్యంగా చేపట్టాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

నాడు-నేడు పాఠశాల తరగతి గదుల నిర్మాణం పనులు వేగవంతగా నాణ్యంగా చేపట్టాలని కాకినాడ డిఎల్‌డిఒ పారంశెట్టి నారాయణమూర్తి ఆదేశించారు. శనివారం సామర్లకోట మండలం పవరలో జడ్‌పి హైస్కూల్‌లో నిర్వహిస్తున్న నాడు-నేడు పనులను ఆకస్మి కంగా తనిఖీలు చేసి పరిశీలిం చారు. పనులు మందకోడిగా సాగుతు న్నాయని, నాణ్యంగా వేగవంగా చేపట్టాలని సంబంధిత హెడ్మాష్టర్‌ను ఆదేశించారు. పలు అంశాలపై సమీక్షించి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన అభ్యర్థులతో వికాస పీడీ లచ్చారావు, డిఆర్‌ఒ శ్రీధర్‌రెడ్డి , కంపెనీ ప్రతినిధులు

## ఇసుజు మోటార్స్‌లో ఇంటర్న్‌షిప్‌కు 200 మంది ఎంపిక

ప్రజాశక్తి - కాకినాడ

వికాస ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా సూచనల మేరకు జిల్లాలో డిగ్రీ చదువుతోన్న సుమారు 200 మంది విద్యార్థులు నెల్లూరు ఇసుజు మోటార్స్ కంపెనీలో ఆన్ ది జాబ్ ట్రైనింగ్‌కు ఎంపికయ్యారు. శనివారం వికాస కార్యాలయం బెన్నెట్ క్లబ్ హాలులో ట్రైనింగ్‌కు వెళుతున్న విద్యార్థులతో సమావేశమై ట్రైనింగ్‌పై వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. లచ్చారావు అవగాహన కల్పించారు. నెల్లూరు ఇసుజు మోటార్స్ కంపెనీకి ఎంపికైన 200 మంది విద్యార్థులు 30వ తేదీ ఆదివారం కంపెనీలో జాయిన్ అవుతారని వీరికి ట్రైనింగ్లో నెలకు రూ.10,000 స్టయిఫండ్‌తో పాటు భోజనం, రవాణా సౌకర్యం కూడా ఉంటుందన్నారు. డి.ఆర్.ఒ కె.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఆన్ ది జాబ్ ట్రైనింగ్ ద్వారా శిక్షణ పొందిన అభ్యర్థులు డిగ్రీ పూర్తిచేసుకున్న వెంటనే ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు పొందడానికి అనుభవం వస్తుందని, ట్రైనింగ్పై విద్యార్థులకు సూచనలు తెలిపారు. జిల్లాలో ఉన్న డిగ్రీ కాలేజీల్లో విద్యార్థులకు వివిధ ప్రముఖ కంపెనీల్లో ఇంటర్న్షిప్ అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వికాస పిడి తెలిపారు. ఈ సమావేశంలో డి.ఆర్.ఒ కె.శ్రీధర్రెడ్డి, జెడ్.పి సిఇఒ సత్యనారాయణ, వికాస సిబ్బంది, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

# వరి కోతలు వాయిదా వేయండి

**- జాయింట్ కలెక్టర్ ఇలక్కియా**

ప్రజాశక్తి - పెద్దాపురం

రాబోయే రెండు రోజుల్లో వర్ష సూచనలు ఉన్నందువల్ల వరి కోతలు వాయిదా వెయ్యాలని జాయింట్ కలెక్టర్ ఇలాక్కియా రైతులకు విజ్ఞప్తి చేశారు. శనివారం పెద్దాపురం మండలం జి.రాగంపేట రైతు భరోసా కేంద్రం పరిధిలో ధాన్యం ఆరబెట్టిన కళ్లాలను పరిశీలిశారు. అనంతరం జెసి మాట్లాడుతూ వరి కోతలు, ధాన్యం ఆరబెట్టడంలో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ధాన్యం అమ్మకంలో ఉన్న సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎంటియు 1156, ఎం టి యు 1121 రకాలు నూక శాతం ఎక్కువగా వస్తుందని ఈ విషయంలో ప్రభుత్వ నుంచి తగు చర్యలు తీసుకోవాలని రైతులు జెసికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కోపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మసకపల్లి శ్రీ రంగనాయకులు, ఎడిఎ దైవ కుమార్, ఎఒ సంజయ్, రైతులు కంటే రామకృష్ణ, బిక్కిన భీమేశ్వరరావు, బండారు శివ, పాలచర్ల బాపిరాజు, సురేష్, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యం పరిశీలిస్తున్న జెసి ఇలాక్కియా

## రూ. 5.03 లక్షల సరుకు జప్తు

ప్రజాశక్తి - కాకినాడ

పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వ, రవాణా, రైస్ మిల్లులు, పెట్రోలు బంకులు తదితరాలు నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి శనివారం నిత్యావసరాల చట్టం-1955, సెక్షన్ 6ఏ కింద ఏడు కేసులను విచారించి, సీజ్ చేసిన రూ. 5,03,000 విలువైన సరుకును ప్రభుత్వానికి జప్తు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలాక్కియా ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా వంట గ్యాస్ సిలిండర్‌ను వ్యాపార అవసరాలకు విని యోగించిన దుకాణ యజమానిపై రూ.10 వేలు జరిమానా విధించినట్లు వెల్లడించారు. ఈ మొత్తం పౌర సరఫరాల ఖాతాకు జమవుతుందన్నారు.

## రిబేటు'కు నేటితో గడువు ముగింపు

**- ఆదివారం కూడా పన్నులు స్వీకరణ**

**- డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్**

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను ఐదు శాతం రిబేటుపై చెల్లించేందుకు ఆదివారం ఒక్కరోజు మాత్రమే గడువు ఉందని కాకినాడ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్ చెప్పారు. శనివారం సాయంత్రం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 2022- 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొత్తం పన్నును ఏకమొత్తంగా ఒకేసారి ఏప్రిల్ 30వ తేదీ లోపు చెల్లించేవారికి ఐదు శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం ఆదివారం సెలవు దినం అయినప్పటికి కౌంటర్లు తెరిచి ఉంటాయన్నారు. అన్ని సచివాలయాలతో పాటు శారదాదేవి ఆలయం, నగరపాలక సంస్థ పాత కార్యాలయం, బాలభవన్‌లలో కూడా పన్నులు స్వీకరించేందుకు సిబ్బంది అందు బాటులో ఉంటారన్నారు. ఇప్పటికే చాలా మంది ఐదు శాతం రిబేటు అవకాశాన్ని సద్వినియోగం చేసుకు న్నారని చెప్పారు. పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పట్టాలిచ్చిన వారికి స్థలాలు ఇవ్వాలంటూ మున్సిపల్ చైర్ పర్సన్ కు కోరుతున్న లబ్ధిదారులు

## పట్టణంలోనే ఇళ్ల స్థలాలు ఇప్పించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

జగనన్న ఇళ్ల స్థలాల్లో భాగంగా పట్టాలి ఇచ్చిన లబ్ధిదారులందరికీ ఇళ్ల స్థలాలు చూపించాలని, పట్నంలో ఉన్న లబ్ధిదారులకు గ్రామ శివారులోని స్మశానాల వద్ద ఇచ్చిన ఇళ్ల స్థలాలు బదులుగా పట్టణం లోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇళ్ల స్థలాల లబ్ధిదారులు ఆందోళన నిర్వహిం చారు. లబ్ధిదారులు మాట్లాడుతూ 27, 28, 29, 30, 31 వార్డుల లోని లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించారన్నారు. సుమారు 12 కిలోమీటర్ల దూరం ప్రాంతమైన వేట్లపాలెం హుస్సేన్నపురం శివారు ప్రాంతాలలో గత ఏడాది అక్టోబర్ 2న ఇళ్ల స్థలాలను చూపించినప్పుడే ఆందోళన చేశామని, అప్పుడు వైసిపి ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు సామర్లకోటలోనే ఇస్తామని చెప్పి సుమారు ఏడు నెలలైనా, పట్టించుకోవడం లేదఅన్నారు. లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలైనా ఇవ్వాలని లేకుంటే అపార్ట్మెంట్లు అన్నా ఇవ్వాలంటూ మరికొందరు కోరారు అలాగే 25,26, పలు వార్డులలోని ప్రజలకు స్థానిక బీసీ గర్ల్స్ హాస్టల్ వద్ద ఇళ్ల స్థలాలను చూపించి సర్వే నంబర్లు కూడా ఇచ్చారని, కానీ నేటికీ ఆ ఇళ్ల స్థలాలను అందించ లేదని అన్నారు. ఇళ్ల స్థలాలనైనా అందిస్తే ఇల్లు నిర్మించుకుంటామని అద్దె కట్టుకోలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. దీనిపై మున్సిపల్ చైర్పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఓబా జాన్ మోజేస్‌లు మాట్లాడుతూ తక్షణం ఇళ్ల స్థలాలను చూపించేందుకు చర్యలు తీసుకుంటామని టౌన్ ప్లానింగ్ అధికారి ఫణి కుమార్ వాటిని పరీక్షించి సోమవారం నాటికి సమస్యను పరిష్కరిస్తామని లబ్ధిదారులకు తెలిపారు. లబ్ధిదారుల నిరసనకు టిడిపి పట్టణ కార్యదర్శి బడుగు శ్రీకాంత్ , టిడిపి కౌన్సిలర్ వలుసువాసులు మద్దతు తెలిపారు.

## పోస్టల్.. ఆర్ఎంఎస్ పెన్షనర్ల ధర్నా

సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న పోస్టల్ పెన్షనర్లు

ప్రజాశక్తి - కాకినాడ

ఎన్‌సిపిపిఎ న్యూ ఢిల్లీ పిలుపు మేరకు శనివారం కాకినాడ పోస్టల్ పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద అల్ ఇండియా పోస్టల్, అర్ఎంఎస్. పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సిఫార్సులు, ఫిక్స్ మెడికల్ అల్లవన్స్ రూ.1000 నుండి 3000 చేయాలని 65 సంవత్స రాలు దాటినవారికి పెన్షన్ 5శాతం, 70 వయసు వారికి 10శాతం, 75 వయసు వారికి 15శాతం, 80 వయసు వారికి 20 శాతం పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. జనవరి జూన్ నెలలో రిటైర్ అయినవారికి ఇంక్రి మెంట్ ఇవ్వాలని 18 నెలల డిఆర్ బకాయిలు చెల్లించాలని, రైలు ప్రయాణంలో సీనియర్ సిటిజెన్‌లకు రాయితీలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం న్యూ ఢిల్లీ పోస్టల్ సెక్రెటరికి, పోస్టల్ సూప రింటెండెంట్ డి.యు.ఎస్.ఎన్. నాగేశ్వరరెడ్డి ద్వారా వినతిపత్రం అంద జేశారు. అల్ ఇండియా పోస్టల్, అర్.ఎంఎస్ పెన్షనర్స్ అసో సియేషన్ అధ్యక్షులు టి.గాలిబు, కార్యదర్శి తురగా సూర్యా రావు, ఫైనాన్స్ కార్యదర్శి సిహెచ్ రామారావు, ఉపాధ్యక్షులు జి.వి.లక్ష్మి నారాయణ, డి.మాణిక్యాలరావు, సహయ కార్యదర్శి ఎమ్.కుర్మరావు ఎన్.త్రినాథ్ రావు, అల్ ఇండియా పెన్షనర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్.ఎస్.ఎన్.వి. సాయిరాం, పెన్షనర్లు రామ లింగేశ్వరరావు, మున్నేశ్వరరావు, వి.ఎ.మార్క్, నరసింహరావు, రామమోహ నరావు, సర్వీస్ అసోసియేషన్ నాయకులు అర్.వి.వి.మూర్తి, గ్రూప్ సి కార్య దర్శి పి.సాగర్, పి4 కార్యదర్శి కె.శ్రీనివాసరావు, డి. శ్రీనివాసరావు, టి. బాబ్జిరావు,పెన్సనర్ల అసోసియేన్ మద్దతుదారులు పాల్గొన్నారు.

## కార్టూ'నిజం'





# గందరగోళంగా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - సామర్లకోట

మున్సిపాలిటీలో గందరగోళ పరిస్థితుల్లో కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగింది. సీనియర్ కౌన్సిలర్ పితాని కృష్ణ మాట్లాడుతూ మున్సిపాలిటీలో స్టాండింగ్ కౌన్సిల్‌గా ఎవరు విధులు నిర్వహిస్తున్నారని ప్రశ్నిస్తూ ఆయన ఒక్కసారి కూడా కౌన్సిల్ సమావేశానికి ఎందుకు హాజరు కావడం లేదని అధికారులను ప్రశ్నించారు. దానికి కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోసెస్‌లు మాట్లాడుతూ స్టాండింగ్ కౌన్సిల్‌గా ఉన్న శ్రీకాకుళపు గోపి ఇప్పటివరకు కౌన్సిల్ సమావేశానికి ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు. నెలకు రూ.15వేలు గౌరవ వేతనం తీసుకుంటూ మున్సిపల్ కేసులు విషయంలో వాదించిన ప్రతీ కేసుకు ఆదనంగా ఫీజులు తీసుకోవడంపై ప్రశ్నించారు. గతంలో ఎవరు ఈ విధంగా రెండు సార్లు లబ్ధి పొందలేదని దీనిలో ఏదో ఒకటి మాత్రమే అమలు చేయాలని తీర్మానిస్తూ అధికారులకు సూచించారు. ఇటీవల బలుసుల పేటలో చర్చి గోడ కూలి ఇద్దరు దుర్మరణం పాలైన సంఘటనపై నిర్మాణానికి సంబంధించి ఎలాంటి అనుమతులు యజమానులు పొందారు అనే అంశంపై టిడిపి కౌన్సిలర్ బలుసు వాసు అధికారులను ప్రశ్నిస్తూ చైర్ పర్సన్ పోడియం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారి ఫణి కుమార్ జోక్యం చేసుకొని చర్చి నిర్మాణం యజమానులు కొత్తగా చేపట్టడం లేదన్నారు. చర్చి యజమానులు మృతుల కుటుంబాలకు న్యాయం చేసినందున సమస్య సమసిపోయిందని, ప్రమాదానికి టౌన్ ప్లానింగ్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు.

చైర్‌పర్సన్ పోడియం ఎదుట బైఠాయించిన టిడిపి కౌన్సిలర్ వాసు

ఇంకా తాగునీటి విషయంలో 28వ వార్డు కౌన్సిలర్ కరణం రాజకుమార్ మాట్లాడుతూ తమ వార్డులోని గణపతినగరం వాటర్ ట్యాంకుల వద్దకు ఉన్న మున్సిపాలిటీ రక్షిత మంచినీటి ప్లాంట్ మోటార్లు రిపేరుకు కేవలం రూ. 30 వేల ఖర్చు చేస్తే ప్లాంట్ వినియోగంలోనికి వచ్చి ప్రజలకు రక్షత నీరందే అవకాశం ఉన్నందున దానిపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, అన్ని శాఖల అధికారులు, అందరూ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**- కౌన్సిల్ లో అమలుకాని నిబంధనలు**

శనివారం జరిగిన మున్సిపల్‌కౌన్సిల్ సమావేశంలోని మహిళా గౌరవ సభ్యుల భర్తలు కౌన్సిల్ సమావేశానికి హాజరయి కౌన్సిల్లో ఏమేమి చెప్పాలో కూడా వారే వెనక నుండి కూడా చెప్పడం పూర్తి నిబంధనలకు విరుద్ధంగా కనిపిం చింది. కౌన్సిల్ సాధారణ సమావేశాలలో మున్సిపల్ అధికారులు గౌరవ సభ్యులు సభ్యులు, పత్రిక విలేకరులకు మాత్రమే అనుమతి ఉండగా ఆరంభంలో అమలు జరిగేవి రాను రాను అధికారులు దీనిని పట్టించుకోవడం మానేశారు. దీనిపై పలు విమర్శలు వస్తున్నాయి.

## ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రతి విద్యార్థి విద్యాభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలను కూడా సద్విని యోగం చేసుకోవాలని డిఆర్‌ఓ శ్రీధర్‌రెడ్డి, జడ్‌పి సిఇఓ సత్యనారాయణ, వికాస పీడీ లచ్చారావు లు అన్నారు. స్థానిక ఎం ఆర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఇంటర్న్‌షిప్ సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా మాట్లాడారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ పాఠ్య ప్రణాళికలో భాగంగా ఎం.ఆర్ కళాశాల నుండి ఎంపికైన డిగ్రీ మూడవ సంవత్సరం 44 మంది విద్యార్థులు శ్రీసిటీ వెల్లూరులోని ఇసుజు కంపెనీలో ఇన్‌టర్న్‌షిప్ చేసేందుకు బయలుదేరుతున్న సందర్భంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి వీరయ్య చౌదరి అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వ హించారు. ప్రిన్సిపాల్ వీరయ్య చౌదరి మాట్లాడుతూ ఆరు నెలల పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందే విద్యార్థులకు నెలకు రూ.12 వేలు చొప్పున శిక్షణా భృతి ఇస్తారన్నారు. శిక్షణా తరగతులను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎం తాతాజీ, కన్వీనర్లు పాల్గొన్నారు.

తాళ్లరేవు లో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

## రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- తాళ్లరేవు

తాళ్లరేవు పంచాయతీ పరదేశమ్మ కాలనీలోని సాయినగర్ ప్రాంతానికి జిల్లా పరిషత్ నిధులు రూ.7 లక్షల 40 వేలు తో నిర్మించనున్న సి.సి. రోడ్డు నిర్మాణానికి జడ్‌పి టిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, ప్రజాప్రతినిధులతో కలిసి శంకు స్థాపన చేశారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తాళ్లరేవు జడ్‌పిటిసి సామ్యూల్ సాగర్ అన్నారు. గత 30 సంవత్సరాలుగా ఎటువంటి అభివద్ధికి నోచుకోని ఈ ప్రాంతానికి రోడ్డు వేయడం అభినందనీయమని సత్యసాయి పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ ఆది నారాయణ వర్మ అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత, ముమ్మిడివరం ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివనారాయణ, జడ్‌పి మాజీ చైర్మన్ దున్న జనార్ధన్ రావు, గ్రామ సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసిని దేవి, ఎంపీటీసీలు చిట్టూరి లలిత, రచ్చ ముత్యాలు, నాయకులు రాయుడు గంగాధర్, దున్న శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## రెండు బస్సులు ఢీకొని డ్రైవర్లు, విద్యార్థులకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

లారీ డ్రైవర్ లారీని నిర్లక్ష్యంగా నడుపుతూ సడన్ బ్రేక్ వేసి ఆపడంతో వెనుకనే వస్తున్న ఒక కళాశాల బస్సు, ఆర్‌టిసి బస్సులకు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో బస్సుల డ్రైవర్లు, విద్యార్థులకు స్వల్ప గాయాలయినట్టు స్థానికులు, పోలీసులు తెలిపారు. శనివారం ఉదయం వేట్లపాలెం వైపు నుంచి సామర్లకోట వైపు వస్తున్న లారీని డ్రైవర్ ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేసి ఆపడంతో లారీ వెనకనే వస్తున్న విద్యార్థులతో ఉన్న ఒక ప్రైవేట్ కళాశాల బస్సు లారీని ఢీ కొట్టింది. అదే బస్సును వెనుక వస్తున్న ఆర్‌టిసి బస్సు కూడా కళాశాల బస్సును వెనుక నుండి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రెండు బస్సుల డ్రైవర్లకు, పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని గ్రామంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఘటనపై కేసు స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళ మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి - గండేపల్లి

సినిమా ఫక్కీలో మహిళ మెడలో తాడును చోరీ చేసిన దుండగులు పరారయ్యారు. గండేపల్లి మండలం మురారి గ్రామ శివారు ఎన్‌హెచ్16 రోడ్డు పక్కన అంబటి బుల్లి వెంకటావు, అతని భార్య గజేకిక పాన్‌షాప్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం సుమారు మూడు గంటల సమయంలో ఎవరో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మోటార్ సైకిల్‌పై పాన్ షాప్ కు వచ్చి ఆమెను సోడా అడిగారు. ఆమె సోడా బాటిల్ ఇస్తుండగా అకస్మాత్తుగా వారు ఆమె మెడలోని మూడు కాసుల మంగళసూత్రాలు గల బంగారు తాడును తెంపుకుని మోటార్ సైకిల్ పై పరారయ్యారు. సంఘటనపై గజేకిక వెంకటావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గండేపల్లి ఎస్ఐ వై.గణేష్ కుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం తాతపూడిలో జరిగింది. అంగర ఎస్ఐ బి.చంటి శనివారం తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కూరి శనివారపు కిషోర్ ఈ నెల 28న తాతపూడి లోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ వద్ద చేస్తుండగా విద్యుత్ షాక్ కు గురయ్యాడు. సమాచారం అందుకున్న అతని తండ్రి సూరిబాబు ఘటనా స్థలానికి వెళ్లేటప్పటికే కిషోర్ మృతి చెందాడు. సూరిబాబు ఫిర్యాదు మేరకు అదే రోజు కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ తెలిపారు.

## నలుగురిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి-తాళ్లపూడి

మండల పరిధిలోని రెండు గ్రామాల్లోపాత సారా కేసులకు సంబంధించి నలుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేసి తహశీల్దార్ బి.రాధిక ఎదుట హాజరు పరచినట్టు కొవ్వూరు సెబ్ సిఐ సత్యనారాయణ తెలిపారు. అన్నదేవరపేటకు చెందిన మద్దెల రమేష్, జి.ఎం.రాజు, టి.బంగారయ్య, పెద్దేవం గ్రామానికి చెందిన దెయ్యాల శ్రీనులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు సిఐ తెలిపారు.

శ్రీ బాంధవి ని అభినందిస్తున్న దొరబాబు

## విద్యార్థినికి దొరబాబు అభినందన

ప్రజాశక్తి - పెద్దాపురం

ఇంటర్మీడియట్ 2023 ఫలితాల్లో సామర్లకోట ప్రగతి కళాశాలకు చెందిన విద్యార్థిని కె శ్రీబాంధవి ఎంపిసి విభాగంలో 470 మార్కులకు 467 మార్కులతో స్టేట్ ఫస్ట్ సాధించింది. ఈ సందర్భంగా శనివారం స్థానిక రామారావుపేటలోని వైసిపి కార్యాలయంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆమెను సత్కరించి అభినందించారు. మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, బైక్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి - కరప

ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న కూలీలకు కరప గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి కుమార్ ఒఆర్ ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయడం జరిగింది. శనివారం ఉపాధి కూలీల వద్దకు వెళ్లి సర్పంచ్ ఆశాజ్యోతి పనులు చేస్తున్న కూలీలు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-తాళ్లపూడి

తాళ్లపూడి బస్టాండ్ సెంటర్లో శనివారం కూలింగ్ చలివేంద్రాన్ని శనివారం మండల మానవతా శాఖ గౌరవాధ్యక్షులు సింహాద్రి జనార్దన్ రావు ప్రారంభించారు. అధ్యక్షులు జోగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ధరకు చల్లని మంచినీటిని అందించడానికి ముందుకు వచ్చిన ఆక్వా వాటర్ యాజమాన్యం రాధాకృష్ణకు అభినందనలు తెలియజేశారు. వి.చంద్రయ్య, సిహెచ్.అంజనేయులు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపక బృందం, ప్రముఖులు

## శ్రీ చైతన్య ప్రైమరీలో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - కాకినాడ

శాంతినగర్ శ్రీ చైతన్య ప్రైమరీ విభాగంలో గ్రాడ్యుయేషన్ సెలబ్రేషన్స్ జరిగాయి. పాఠశాల రీజనల్ ఇంచార్జ్ పి.గోపికృష్ణ, కె2 ప్రిన్సిపల్ సుల్తాన్ ఫాత్ న్నారు. ఐదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉమాలక్ష్మి విద్యార్థులను అభినందించారు. అతిథిగా సుల్తాన్ మాట్లాడుతూ విద్యా రంగం లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. ఉపాధ్యాయులు వరలక్ష్మి, కల్పన, తల్లిదండ్రులు, ప్రైమరీ ఇన్చార్జ్ విశ్వ ప్రియ, విద్యార్థి తల్లిదండ్రులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# యానాం వార్తలు

నీటి మట్టాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ అశోక్

## తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గ పరిధిలో తాగునీటి అవసరాలను తీర్చే 55 ఎకరాల చెరువులను శనివారం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పరిశీలించారు. పిల్లంక - బ్రహ్మపురి ఫ్రెంచ్ కెనాల్ నుంచి వస్తున్న నీరు 55 ఎకరాల చెరువులో నిండుతున్న తీరును పరిశీలించారు. నియోజకవర్గ పరిధిలో తాగు నీటి ఇబ్బందులు రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకున్నామని, ఆ దిశగా కాకినాడ జిల్లా కలెక్టర్ తో సమస్య గూర్చి అనేక సార్లు విన్నవించామని ఎంఎల్ఎ అశోక్ తెలిపారు. అంతే కాక ధవళేశ్వరం ఇరిగేషన్ అధికారులను వారి కార్యాలయంలో కలసి వంతుల వారీ ప్రత్యేక నీటి సరఫరాకు ఇవ్వాలని కోరినట్లు దానికి వారు పూర్తిగా సహకరించారన్నారు. అన్ని ప్రయత్నాలు ఫలిం చడంతో నీరు వస్తుందన్నారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడాలని విజ్ఞప్తి చేశారు.

నూకరాజు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంఎల్ఎ అశోక్

## పలువురికి ఎంఎల్ఎ పరామర్శ

యానాం నియోజకవర్గంలోని ఇటీవల అనారోగ్య కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలను శనివారం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పరామర్శించారు. గణపతి నగర్ నివాసి పిడబ్ల్యుడి ఎఫ్టి సిఎల్ఆర్ ఉద్యోగి పంపన నూకరాజు చికిత్స పొందుతూ మరణించాడు. వారి కుటుంబాన్ని, ఫరంపేట వాసి విద్యుత్ శాఖలో బిల్ కలెక్టర్‌గా పని చేసిన కర్రి విజయ కుమారి, గొల్లల వీధికి చెందిన మరుకుర్తి రామకృష్ణ లు మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## శృంగార వల్లభుని ఆలయానికి రూ 3.66 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం తిరుపతిలోని శ్రీ శంగార వల్లభ స్వామి ఆలయాన్ని శనివారం అధిక సంఖ్యలో యాత్రికులు సందర్శించారని ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. శనివారం ఒక రోజు వివిధ టిక్కెట్ల ద్వారా రూ 3,66,536, అన్నదానం విరాళాల ద్వారా రూ 59,046, కేశఖండన ద్వారా రూ 9,400 ఆదాయం సమకూరిందన్నారు. యాత్రికులకు ఉదయం పులిహోర ప్రసాదం,మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. యాత్రికులకు అర్చకులు, ప్రజా ప్రతినిధులు కుంచే బుచ్చిరాజు,కర్రి జగదీష్, ఆలయ సిబ్బంది కృష్ణ, మోహన్ రావు, సత్యనారాయణ, స్వచ్ఛంద సేవకులు అంజనీ కుమార్, గ్రామ ప్రజలు సహాయ సహకారాలు అందించారన్నారు.

## నవోదయ పరీక్షకు 282 మంది హాజరు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షలను శనివారం నిర్వహించారు. పరీక్షకు 282 మంది విద్యార్థులు హాజరయ్యారు. మండలానికి సంబంధించి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో శనివారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటన్నర వరకు పరీక్ష నిర్వహించారు. మొత్తం 325 మంది విద్యార్థులు హాజరుకావల్సి ఉండగా, వారిలో 43 మంది హాజరుకాలేదు. పరీక్షాకేంద్రాన్ని మండల స్థాయి స్క్వాడ్ అధికారి ఎంఇఒ వై శివరామకృష్ణయ్య పరిశీలించారు. పరీక్షా కేంద్రం ఛీఫ్ సూపరింటెండెంట్ హెచ్ఎం ఎస్ కొండారెడ్డి, సెంటర్ పరిశీలకులుగా నవోదయ విద్యాలయ నుండి ఎం భాస్కరరావులు విధులు నిర్వహించారు.

## ఆలిండియా జెఇఇ టాపర్‌గా రోహన్ శివ తేజ

ప్రజాశక్తి - కరప

రోహన్ శివతేజ

కరప గ్రామానికి చెందిన వడ్డీ రోహన్ శివతేజ ఆల్ ఇండియా జెఇఇ పరీక్షలో 99.92 ఉత్తీర్ణతతో 952వ ర్యాంకు సాధించి టాపర్గా నిలిచారని తండ్రి వడ్డీ వెంకటేశ్వరరావు తెలిపారు. జనవరి నెలలో జరిగిన మొదటి సెషన్ 99.88% సాధించగా ఈ నెలలో జరిగిన చివరి దైన రెండవ సెషన్ లో 99.92% కు పర్సంటేజ్ ను మెరుగుపరుచుకుని ఆలిండియా స్థాయిలో 952 వరకు సాధించాడు. చదువులో చిన్నప్పుడు నుండి చురుగ్గా ఉండి రోహన్ గతంలో ఏపీ పాలిటెక్నిక్ లో రాష్ట్రస్థాయి 19వ ర్యాంకు సాధించాడు.ఈ సందర్భంగా రోహన్ మాట్లాడుతూ మా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కావడంతో ప్రిపరేషన్‌లో మెలకువలు నేర్పుతూ కష్టపడి చదివే విధంగా ప్రోత్సహించారని రోహన్ శివతేజ తెలిపారు. జూన్ నెలలో జరగబోయే జేఈఈ అడ్వాన్స్ లో మంచి ర్యాంకు సాధించి ప్రతిష్టాత్మక ముంబై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చెయ్యాలన్నది తన చిరకాల స్వప్నమని రోహన్ శివతేజ తెలి పారు. తండ్రి ఉపాధ్యాయులుగా కరప నక్కవారిపేట స్కూల్లో పనిచేస్తుండగా తల్లి కాజులూరు మండలంలో ఉపాధ్యాయనిగా పనిచేస్తున్నారు.

## పారిశుధ్య పనులపై ఎడిసి పరిశీలన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు శనివారం నగరంలో జరుగుతున్న పూడికతీత పనులను పర్యవేక్షించారు. జగన్నాధపురం 17వ డివిజన్ పరిధిలోని ఉమెన్స్ కళాశాల ప్రాంతంలో డి సిల్టేషన్ పనులు, 20వ డివిజన్లోని మేకల కబేళా ప్రాంతంలో కూడా పూడిక తీత పనులను కూడా ఆయన పరిశీలించారు. వర్షాలు పడే లోపుగా అన్ని కల్వర్టులు, మేజర్ డ్రైన్ లలో పూడికతీత పూర్తి చేసి, ఇంజనీరింగ్, పారిశుధ్య విభాగాలు సమన్వయంతో ఈ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికిన చేపట్టి పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్స్పెక్టర్లు రెడ్డి, ధర్మాజీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రజలను మోసగించడమే వైసిపి ఎజెండా

ప్రజాశక్తి - కాకినాడరూరల్

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోని ప్రజలను మోసగించడమే వైసిపి ఏజెండా అని కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి విమర్శించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం కాకినాడ కార్పొరేషన్లో 49 వ డివిజన్లో మంగళవారం ఇంటింటికి మీ అనంతలక్ష్మి, ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్రం పురోభివృద్ధి సాధించేందుకు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మళ్లీ సీఎం కావలసిన అవసరం ఎంతైనా ఉందని అనంతలక్ష్మి, సత్యనారాయణ మూర్తి ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పాలిక ఉషారాణి, సూర్య ప్రకాష్, కాకర్లపూడి రాజేష్ వర్మ, సాగిరాజు సూరిబాబు రాజు, దాట్ల రవి బుజ్జి, పెనుమత్స బంగారు రాజు, మంతెన రవి వర్మ, పలివెల త్రిమూర్తులు, గాయత్రి కోణాల కృష్ణ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పాలకుల లోపం.. ప్రజలకు శాపం

# గోదారి గలగలలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రభుత్వ నిర్లక్ష్యం విద్యార్థుల పాలిట శాపంగా మారింది. విద్యా వ్యవస్థ అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నాం అంటూ పాలకులు చేసిన ఆర్భాటపు ప్రచారాలకు తాజా ఫలితాలు నిలువుటద్దం పట్టాయి.

మొదటి సంవత్సరం ఫలితాలలో జిల్లాకు ఆరవ స్థానం లభించగా, రెండో సంవత్సర ఫలితాలలో ఎనిమిదవ స్థానానికే పరిమితం అయ్యారు. గత ఏడాదితో పోల్చితే ఫలితాలు కొంత మెరుగైనట్లు కన్పిస్తున్న ప్పటికీ ఈ ఏడాది పూర్తి స్థాయిలో తరగతులు నిర్వహించారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కసరత్తు చేపట్టామని ఇంటర్మీడియెట్ విద్యా మండలి ప్రకటించింది. అయితే ఆచరణలో పూర్తి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకుల కొరత వేధించింది. బొమ్మూరు ఎంఎంజి కాలేజీలో ఉత్తీర్ణత సాధించకపోవటానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆ కాలేజీ ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రులు చేపట్టిన ఆందోళన జిల్లాలో చర్చనీయంశమైంది. ఉన్నతాధికారుల జోక్యంతో ఆందోళన సద్దుమనిగింది. మండలానికి ఒక మహిళా కాలేజీ అమలుకు నోచుకోలేదు. అత్యధిక కాలేజీలలో అధ్యాపకులను కేటాయించకపోవటంతో విద్యార్థులు అడ్మిషన్లు సమీప కాలేజీలకు తరలి వెళ్లారు. మరో వైపు పాఠ్యపుస్తకాల పంపిణీ చేయకపోవటతో విద్యార్థులు అధిక ధరకు బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయలేక కేవలం రన్నింగ్ నోట్స్‌మీదే ఆధారపడినట్లు తెలుస్తోంది. ఈ సమస్యలను చక్కదిద్దాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పలు మార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. దీంతో ఫలితాలపై తీవ్ర ప్రభావం కన్పించింది. కేజీబీవీలలో పూర్తిగా వెనుకబాటు కన్పించింది.

### వరి రైతులకు కన్నీళ్లు .....కడగండ్లు

ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు... మరో వైపు ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిబంధనల పేరుతో రైస్ మిల్లర్ల వేధింపులు జిల్లాలోని రైతులకు కష్టాలను , కడగండ్లను మిగుల్చుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపుగా సాగు తుది దశకు వచ్చింది. దీంతో రైతులు ముమ్మరంగా కోతలు ప్రారంభమయ్యాయి. ఈ వారంలో కురిసిన అకాల వర్షాలకు కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలోనూ పంటనష్టం వాటిల్లింది. రైతులు కష్టం నీటి పాలైందని ధాన్యం కొనుగోలు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మరో వైపు తేమ శాతం అధికంగా ఉందంటూ రైస్ మిల్లర్లు ధాన్యం బస్తాలను దిగుమతి చేసుకోవటంలేదు. ఈ క్రమంలో గోకవరం మండలంలో రైతులు చేపట్టిన ఆందోళనతో యంత్రాంగం దిగొచ్చింది. జెసి తేజ్ భరత్ చొరవతో రైస్ మిల్లర్లు ఎట్టకేలకు ధాన్యం దిగుమతి చేసుకునేందుకు అంగీ కరించారు. కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించ టంతో అధిక శాతం మంది ఇప్పటికే దళారులకు విక్రయించామని, వర్షాలు కురుస్తున్న క్రమంలో అధికారులు త్వరితగతిన కొనుగోలు చేయకుంటే పూర్తిగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు.

### మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో సేవలు శూన్యం... పన్నులు వసూళ్లు ఘనం

ఆర్థిక సంవత్సరం ముగింపు పేరుతో జిల్లాలోని కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీల అధికారులు ప్రజల గోళ్లూడపీకేలా వేధిస్తూ పన్నులు వసూళ్ల పరంపర కొనసాగిస్తున్నారు. ఆస్థి పన్నులు చెల్లించని వారి ఆస్తులు జప్తు చేస్తామంటూ రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో ఓ ప్రైవేట్ వెహికల్ ద్వారా ప్రచారం చేయటంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. గతంలో ఖాళీ స్థలాల పన్నులు చెల్లించకుంటే స్వాధీనం చేసుకుంటామంటూ ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయటంతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం విధితమే. సాధారణంగా ప్రతి ఏటా మార్చి 31 గడువు తేదీ తెలిసిన విషయమే. ఈ ఏడాది ఈ నెల 30 వరకూ పొడిగించి వసూళ్లు చేపట్టారు. దీంతో క్షేత్రస్థాయి సిబ్బంది ప్రజల వెంటపడి మరీ వసూళ్ల పరం పర తెరలేపారు. 5 శాతం పన్ను రాయితీ చెప్పినప్పటికీ ఆచరణలో నేతి బీర చందంగా మారింది. దీనిపై పట్టణ వాసుల నుంచి విమర్శలు వచ్చినా కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీల సిబ్బంది వెనుకడుగు వేయలేదు. ఏప్రిల్ 1 నుంచి కొత్త పన్ను విధానం అమలు చేసినట్లు కార్పొరేషన్ అధికారులు జవాబిస్తున్నారు. గత ఏడాదితో పోల్చితే అత్యధికంగా పన్నుల వసూలు జరిగినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నారు. ఓ వైపు నిత్యావసర సరుకుల ధరల పెంపు, మరో వైపు పన్నుల మోత గోరుచుట్టుపై రోకలిపోటులామారాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలకుల తీరును విమర్శిస్తున్నారు.

### సిపిఐ, సిపిఎం చేపట్టిన ప్రచార భేరికి విశేష మద్దతు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ, సిపిఎం సంయుక్త ఆధ్వర్యంలో ఉమ్మడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం విధితమే. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా చేపట్టిన నిరసనలు, ఆందోళనలు, ప్రచార కార్యక్రమాలకు విశేష స్పందన లభించింది. ప్రజలు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను వామపక్ష పార్టీల నాయకులతో పంచుకున్నారు. జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన బహిరంగ సభలలో ఉద్యోగులు, కార్మికులు, ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం అయ్యాయి.

పైడా వింగ్స్ వేదికపై మాట్లాడుతున్న సినీ నటుడు అల్లరి నరేష్

## తారల సందడితో ముగిసిన పైడా వింగ్స్ 2- కె 23

ప్రజాశక్తి - తాళ్లరేవు

పైడా విద్యాసంస్థల ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించిన పైడావింగ్స్ టూ కే 23 ఫెస్ట్ విద్యార్థుల కోలాహలం, సినీ తారల సందడితో ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, త్రో బాల్ వంటి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. రాష్ట్రంలోని పలు ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాల నుంచి విద్యార్థులు హాజరై పలు రకాల ప్రాజెక్టులు ప్రదర్శించారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పైడా అగ్రికల్చర్ విద్యార్థులు చేసిన రైతే రాజు అనే స్కిట్ అందరిని ఆకట్టుకుంది. ఇతర కళాశాల నుంచి వచ్చిన విద్యార్థులు తీసిన డాక్యుమెంటరీలు ప్రదర్శించారు. జెఎన్‌టియుకె డైరెక్టర్ కె.వెంకటరెడ్డి విద్యార్థులకు సందేశాన్ని ఇచ్చారు. అనంతరం వెంకటరెడ్డి పైడా విద్యాసంస్థల చైర్మన్ పైడా సత్యప్రసాద్, సెక్రటరీ శ్రీరామ్, జాయింట్ సెక్రెటరీ నిత్య శ్రీరామ్, డీన్ వీరభద్రరావు డి.డి. రవీందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ సూర్యప్రకాశరావులతో కలసి పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

### సినీ తారల సందడి

అల్లరి సినిమాతో హీరోగా అలరించి ఆ సినిమా పేరు ఇంటి పేరుగా మార్చుకుని నవ్వులతో అందరిని అలరించిన అల్లరి నరేష్ సీమటపాకాయ్ గా పేలి, కితకితలు, సుడిగాడు, బ్లేడ్ బాబ్జి సినిమాలతో ఎన్నో నవ్వులు పండించిన అల్లరి నరేష్ తన 60వ సినిమా ఉగ్రం ప్రమోషన్ లో భాగంగా పైడా లో జరుగుతున్న పైడావింగ్స్ కు విచ్చేసి విద్యార్థులతో సెల్ఫీలు దిగారు. అల్లరి నరేష్ రాకతో కళాశాల ప్రాంగణంలో సందడి నెలకొంది. అల్లరి నరేష్ వెంట ఉగ్రం చిత్రం హీరోయిన్ మిర్నామీనన్, సహనటుడు సాయి శ్రీనివాస్ కళాశాలలో సందడి చేశారు. ప్రేమ కథ చిత్రం, కల్కి వంటి చిత్రాల్లో నటించిన హీరోయిన్ నందిత శ్వేత కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో విద్యార్థులతో కలిసి స్టెప్పులు వేశారు. ఇతర కళాశాలల ప్రిన్సి పాల్‌లు, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు రమేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### దువ్వాడ వద్ద మరమ్మతుల కారణంగా

## నేటి నుంచి పలు రైళ్ల రద్దు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

విశాఖపట్నం జిల్లా దువ్వాడ రైల్వే స్టేషన్ మెయిన్‌లైన్ వద్ద జరగుతున్న పనుల కారణంగా ఈ నెల 30వ తేదీ నుండి పలు రైళ్లను పూర్తిగా, పాక్షికంగా రద్దుచేస్తూ దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. దీంతో విశాఖపట్నం-రాజమహేంద్రవరం మధ్య నడిచే 07467/66 పాసింజరు స్పెషల్ రైలు, అలాగే 17267/68 కాకినాడ- విశాఖపట్నం మధ్య నడిచే రైలు కూడా 30వ తేదీ ఆదివారం నుండి మే 7 వతేదీవరకూ రద్దుచేశారు.17220 విశాఖపట్నం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలును కూడా 30వ తేదీ నుండి మే 7 వ తేదీ వరకూ రద్దు చేశారు.17219 మచిలీపట్నం- విశాఖపట్నంల మధ్య నడిచే రైలు ఈ నెల 29 నుండి మే 6వ తేదీ వరకూ రద్దుచేశారు. 17479 పూర్తి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలును మే 5, మే 8 తేదీల్లో రద్దుపర్చారు. 17480 తిరుపతి- పూరి ఎక్స్‌ప్రెస్‌ను మే 5, 6 తేదీల్లో రద్దుచేశారు. 22701 విశాఖ పట్నం-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌ను మే 6వ తేదీన, 22702 విజయ వాడ-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌ను మే6వ తేదీన రద్దుచేశారు. 12861 విశాఖపట్నం-కాచీగూడ ఎక్స్‌ప్రెస్‌ను మే 6,7 తేదీలు రెండు రోజులు రద్దుచేశారు. ఈ మేరకు సికింద్రాబాద్ ట్రాన్స్‌పోర్టేషన్ బ్రాంచి, హెడ్ క్వార్టర్స్ కార్యాలయం నుండి ఉత్తర్వులు ఆయా స్టేషన్లకు, డిఆర్ఎంలకు శనివారం సాయంత్రం జారీ చేశారు.

## దళిత యువకుల మృతిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలి

ప్రజాశక్తి - కాజులూరు

ఇటీవల బయో డీజిల్ ట్యాంకర్ల పడి మృతి చెందిన దళిత యువకుల మృతిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని అమలాపురం మాజీ ఎంపి హర్షకుమార్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఆర్యవటం శీల గ్రామాల్లో తాతపూడి మహేష్ శివకుమార్ల మతి చెందటంతో వారి కుటుంబ సభ్యులను హర్ష కుమార్ పరామర్శించి మాట్లాడారు. దళిత యువకుల మతిపై పలు అనుమానాలు వినిపిస్తు న్నాయని ఒక వర్గంను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని దీనిపై పోస్ట్‌మార్టమ్ రిపోర్ట్ సక్రమంగా రాకపోతే రీ పోస్టుమార్టం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాజులూరు ఉప సర్పంచ్ దండంగి చిన్నారావు, వంగ శ్రీనివాస్ రాగం పోల రాజు బండి అబ్బులు పాల్గొన్నారు.

## పోలీసులకు ఎస్‌పి ప్రశంస

ప్రశాంసాపత్రాలు అందుకున్న పోలీసు అధికారులతో ఎస్‌పి సతీష్‌కుమార్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఇటీవల కాలంలో పలు ఇంటి దొంగతనం కేసులలో ముద్దాయిలను అరెస్టు చేసి సుమారు 40 లక్షల రూపాయలు విలువైన వెండి, బంగారు ఆభరణా లను మరియు నగదును రికవరీ చేసిన కాకినాడ జిల్లా క్రైమ్ అధికారులు, సిబ్బందిని జగ్గంపేట సర్కిల్ పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఘనంగా సన్మానించారు. ఎస్ మురళీ మోహన్, డిఎస్‌పి దిశ పోలీస్ స్టేషన్ ( పోలీసు ఉత్తమ సేవా పతకం), ఎస్‌కె అబ్దుల్ నబీ, ఇన్స్పెక్టర్ పెద్దాపురం పోలీస్ స్టేషన్ (పోలీసు సేవా పతకం), ఎ. సత్యనారాయణ, సబ్ ఇన్స్పెక్టర్, పిఠాపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్(పోలీసు సేవా పతకం), జె.రామస్వామి ఏఆర్ఎస్ఐ, కాకినాడ ఎఆర్ విభాగం (పోలీసు సేవా పతకం), కె సూరన్న , హెడ్ కానిస్టేబుల్ , పెద్దాపురం పోలీస్ స్టేషన్ (పోలీసు సేవా పతకం), పి.గణేష్, హెడ్ కానిస్టేబుల్, అన్నవరం పోలీస్ స్టేషన్ (పోలీసు సేవా పతకం) అందజేశారు

**ఇంటి దొంగతనం కేసులలో రికవరీ చేసిన వారు :** ఎస్ మురళీ మోహన్, డిఎస్‌పి దిశ పోలీస్ స్టేషన్, కాకినాడ, ఎస్. రాంబాబు డిఎస్‌పి క్రైమ్స్, కాకినాడ, బి.సూర్య అప్పారావు , సిఐ, జగ్గంపేట సర్కిల్, సిహెచ్ విద్యాసాగర్, సబ్ ఇన్స్పెక్టర్, జగ్గంపేట పోలీస్‌స్టేషన్, వై. గణేష్ కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్, గండేపల్లి పోలీస్ స్టేషన్, టీ.క్రాంతికుమార్, సబ్ ఇన్స్పెక్టర్, క్రైమ్స్ కాకినాడ, కె గోవిందరావు , క్రైమ్స్ కాకినాడ, జి.నరసింగ రావు, గండేపల్లి పోలీస్ స్టేషన్. మూర్తి, హెడ్ కానిస్టేబుల్ గండేపల్లి పోలీస్ స్టేషన్, జె.కాశీవిశ్వనాథం, పిసి గండేపల్లి పోలీస్ స్టేషన్, జె.వీరబాబు, పిసి, గండేపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌పి సతీష్ కుమార్ అభినందించారు.

గండేపల్లి ఎస్ఐ గణేష్ కుమార్‌కు ప్రశంసాపత్రాన్ని ఇస్తున్న ఎస్‌పి సతీష్‌కుమార్

## దౌర్జన్యం కేసులో 56 మందిపై కేసు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

తన భూమిలో శుక్రవారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన వ్యక్తులు ప్రవేశించి దౌర్జన్యంగా కొబ్బరి మొక్కలు నరికి వేయడంతో పాటు ఇతర ఆస్తులకు నష్టం కలిగించారంటూ ఎన్.కొత్తపల్లికి చెందిన కోలా నరసింహమూర్తి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు సంబంధించిన భూ వివాదం హైకోర్టులో ఉండగా దౌర్జన్యంగా భూమిలో ప్రవేశించి తనకు నష్టం కలిగించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి. వెంకటేశ్వరరావు 56 మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

## అంగన్‌వాడీ హెల్పర్లకు నియామక పత్రాలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

నియోజకవర్గ పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీ పోస్టులకు ఇటీవల అర్హులను ఎంపిక చేశారు. వీరికి రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ శనివారం నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి అంబటి భవాని, ఐసిడిఎస్ అధికారి వి.వరాహ లక్ష్మి, సర్పంచ్ కొత్తపల్లి అరుణ పాల్గొన్నారు.

## చలో విశాఖ పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-అమలాపురం

మేడే కార్మిక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర టిఎన్‌టియుసి కమిటి నిర్వహిస్తున్న చలో విశాఖ కార్యక్రమంలో భాగంగా అమలాపురం పార్లమెంట్ ఇంచార్జి గంటి హరీశ్ మాధుర్ బాలయోగి ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర టిఎన్‌టియుసి ఉపాధ్యక్షులు జోనల్ 2 ఇంచార్జి సబ్బతి ఫణీశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు.

## మెగా సర్వే విజయవంతం

ప్రజాశక్తి-రాజానగరం

రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో మెగా సర్వే విజయవంతం కావడానికి కారణమైన వైసిపి కార్యకర్తలందరికీ పాదాభివందనం చేస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎంఎల్ఎ జక్కంపూడి రాజా అన్నారు. రాజానగరం పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. దీనిలో ప్రభుత్వం సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు తదితర వాటి గురించి వివరించారు. నియోజకవర్గ పరిశీలకులు రాజశేఖర్,మండల కన్వీనర్ దూలం పెద్ద, జెడ్‌పిటిసి సభ్యులు వాసంశెట్టి పెద్ద వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో నగరం ఎడ్యుకేర్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మామిడికుదురు

మామిడికుదురు మండలం, నగరం ఎడ్యుకేర్ జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులు బుధవారం విడుదలైన ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించచారని కరెస్పాండెంట్ కె. మురార్జి, డైరెక్టర్ కె. వాణి తెలిపారు. ఎంపిసి విభాగంలో వలవల పద్మ తేజ 1000 మార్కులకుగాను 982, చీకట్ల అనురాధ 978, అడబాల జ్యోతిక 975, షేక్ అమీన 975, ముత్యాల తేజస్వి 972, దారపురెడ్డి రేణుక 972, అడబాల గణేష్ కుమార్ 953, సిరిగినీడి అశ్రీత 953 అలాగే మరో 20 కి పైగా విద్యార్థులు 900 ఆపై మార్కులు సాధించారని చెప్పారు. అలాగే బైపిసి విభాగంలో కోళ్ల స్నేహ 940, మద్దుల మన్విత 935 సాధించారన్నారు. శనివారం విడుదలైన జె ఈ ఈ మెయిన్స్ 2023 ఎగ్జాంలో ముగ్గురు విద్యార్థులు 90కి పైగా పెర్సెంటైల్ ఉత్తమ ఫలితాలు సాధించారు. షేక్ అమీన 94.8, అడబాల జ్యోతిక 94.5, జిత్తుక పుష్పిత 93.89 పర్సంటేజ్ సాధించారని తెలిపారు.

## ధాన్యం సొమ్ము సకాలంలో జమ చేయాలి

ప్రజాశక్తి-తాళ్లపూడి

రైతు పండించిన ధాన్యాన్ని ఆర్ బి కె ల ద్వారా రైతు మిల్లులకు తరలించిన తరువాత తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి సకాలంలో డబ్బులు రైతుల ఖాతాలకి జమ చేసేలా చూడాలని పలువురు రైతులు అధికారులను కోరారు. తాళ్లపూడిలోని సింగులూరి సత్తిబాబు పొలంలో శనివారం అధికారులు వరి పంట కోత ప్రయోగం నిర్వహించారు. పంట ఎకరానికి 50 బస్తాలు దిగుబడి వచ్చినట్లుగా గుర్తించడం జరిగిందని గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. వ్యవసాయ సహాయకులు రేవతి ఆనంద్ తదితరులు రైతులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మలాపురం రూరల్ మండలం కామనగరువు పసిడిచెరువులో అంబేద్కర్ విగ్రహాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. గ్రామ సర్పంచ్ నక్కా అరుణకుమారి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి పినిపే విశ్వరూప్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా యువత నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దళిత ఐక్య వేదిక నాయకులు డిబి.లోక్, జాంగా బాబురావు, ఇసుకపట్ల రఘుబాబు, ఉంద్రు బాబ్జి, మెండు రమేష్ బాబు, పెయ్యాల శ్రీనివాస్, మాజీ సర్పంచులు రాజలపూడి భీముడు, నక్కా సంపత్, జెడ్‌పిటిసి సభ్యులు పందిరి శ్రీ హరి, గెడ్డం సంపత్‌రావు, ఎంపిటిసి సభ్యురాలు మెండు గంగా భవాని, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**పేరు మార్పు**

తూర్పు గోదావరి జిల్లా, నిడదవోలు మండలం, నిడదవోలు పట్టణం, డి.నెం.2-13-10/1, శాంతి నగర్ కాపురస్తులైన శ్రీ **తాడిమళ్ళ వెంకట సాయి ఫణి శ్రీ చైతన్య, తండ్రి : గాంధీ,** అనువారికి మంజూరు చేసిన Disability Certificate నందు వీరి పేరు **తాడిమళ్ళ వెంకట సాయి ఫణి శ్రీ చైతన్య కు బదులుగా తాడిమళ్ళ శ్రీ చైతన్య అని తప్పుగా నమోదు కాబడినది. కావున తాడిమళ్ళ వెంకట సాయి ఫణి శ్రీ చైతన్య మరియు తాడిమళ్ళ శ్రీ చైతన్య** ఇద్దరూ ఒక్కరే అని ధృవపత్రం ఇప్పించవలసిందిగా దరఖాస్తు చేసియున్నారు.
సదరు విషయమై విచారణ చేయగా **తాడిమళ్ళ వెంకట సాయి ఫణి శ్రీ చైతన్య మరియు తాడిమళ్ళ శ్రీ చైతన్య** అనిన ఇద్దరూ ఒక్కరే అయివున్నారని ధృవీకరించడమైనది. ఈ ధృవపత్రం కోర్టు వివాదములకు వర్తించదు.